నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I హైదరాబాద్, ఆదివారం 1 డిసెంబర్ 2024 YADADRI BHUVANAGIRI




మీడియాతో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, పక్కన మాజీ డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

# తట్టెడు మట్టి ఎత్తనోళ్లు నీళ్లు తెస్తారా?

- గోదావరి జలాలు అందిస్తున్నామనడానికి కాంగ్రెసోళ్లకు సిగ్గుండాలి..
- కాళేశ్వరం, మిషన్ భగీరథ కేసీఆర్ కలల ప్రాజెక్టులు
- మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

మోటకొండూర్, నవంబర్ 30 : అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతున్నా తట్టెడు మట్టి ఎత్తని కాంగ్రెసోళ్లు నీళ్లు తెస్తారా అని మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ కలల ప్రాజెక్టులైన కాళేశ్వరం, మిషన్ భగీరథపై గతంలో విమర్శించిన కాంగ్రెస్ మంత్రులు ఏ ముఖం పెట్టుకుని గోదావరి జలాలు అందిస్తున్నామని చెప్పడానికి సిగ్గుండాలని అన్నారు. మోటకొండూర్ మండల కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు.. కేసీఆర్ నిర్మించిన కొండపోచమ్మ, మల్లన్నసాగర్ కాల్వల ద్వారానే నీళ్లు వస్తున్నాయి తప్ప కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఒరగబెట్టిందేమీ లేదని చెప్పారు. నీళ్లు అందిస్తున్నామని చెప్పే మంత్రి కోమటిరెడ్డి, ప్రభుత్వ విప్ ఐలయ్యకు ప్రాజెక్టులపై అవగాహన లేదన్నారు. కేసీఆర్ కష్టంతోనే నీళ్లు అందుతున్నాయని, అది రైతులకు తెలుసని, 10 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులు కట్టిందా అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పది నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదని మండిపడ్డారు.

**రైతులకు బోనస్ బోగసే.. : డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సన్న వడ్లకు ఇస్తామన్న బోనస్ బోగస్ మాటలా మారిందని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్షాలను తిట్టడంపై ఉన్న శ్రద్ధ సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులకు రైతులకు సంక్షేమంపై లేకుండా పోయిందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరిగాయని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 13.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం డీసీసీబీ ద్వారా కొనుగోలు చేశామని, కానీ రాష్ట్ర సివిల్ సప్లయ్ కమిషనర్ చవాన్ ఈ నెల 27 వరకు రాష్ట్రం మొత్తంలో 25లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశామని చెప్పడానికి సిగ్గుండాలని చెప్పారు. ప్రభుత్వంపై నమ్మకం లేక పోవడంతోనే రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద ధాన్యం విక్రయించారని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎంత ధాన్యం కొనుగోలు చేశారో.. ఎంత బోనస్ ఇచ్చారో చెప్పాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిని ప్రశ్నించారు. సమావేశంలో నార్మూల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య, బీఆర్‌ఎస్‌వై నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డమీది రవీందర్, యాదగిరిగుట్ట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మాజీ డైరెక్టర్లు అనంతుల జంగారెడ్డి, బొబ్బలి యాదిరెడ్డి, నాయకులు పన్నాల అంజిరెడ్డి, బైరోజు వెంకటాచారి, ఎగ్గిడి కృష్ణ, బురాన్, మల్గ గౌరయ్య, బొట్ల శ్రీనివాస్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

నకిరేకల్, నవంబర్ 30 : బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లో శనివారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుత ప్రభుత్వ పనితీరు, క్షేత్రస్థాయిలో పరిస్థితి, ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, దీక్ష దివస్ జరిగిన తీరు తదితర వివరాలను కేసీఆర్ చిరుమర్తిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో దీక్షా దివస్ విజయవంతంగా జరిగినట్లు చిరుమర్తి కేసీఆర్‌కు చెప్పారు.



మాజీ సీఎం కేసీఆర్‌తో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

# ఆధ్యాత్మిక కోవెల@ యాదాద్రి

## పుణ్యక్షేత్రాలకు నిలయంగా యాదాద్రి భువనగిరి జిల్లా



యాదగిరిగుట్ట ఆలయం

**ఇప్పటికే ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యాదగిరి గుట్ట ఆలయం**

**కొలనుపాలకలో సోమేశ్వరస్వామి ఆలయం, జైన్ మందిర్**

**వేములకొండలో మత్స్యగిరి క్షేత్రం.. నాగిరెడ్డిపల్లిలో రమణేశ్వరం**

**భువనగిరిలో రేణుకా ఎలమ్మ తల్లి దేవాలయం**

**ఇటీవల స్వర్ణగిరిలో కొలువైన వేంకటేశ్వరుడి క్షేత్రం**

**దేశ, విదేశాల నుంచి వేలాది మంది భక్తుల తాకిడి**

**జిల్లాలో భారీగా పెరిగిన రద్దీ.. ఎందరికో ఉపాధి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆధ్యాత్మికతకు వేదిక అయ్యింది. జిల్లా పుణ్యక్షేత్రాలకు కోవెలగా మారింది. భక్తులకు కొంగు బంగారమైన దేవుళ్లకు నిలయమైంది. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం మొదలుకొని ఇటీవల కొలువైన స్వర్ణగిరి వేంకటేశ్వస్వామి వరకు ఎన్నో పవిత్ర ఆలయాలకు నెలవైంది. దేశ, విదేశాల నుంచి నిత్యం వేలాది మంది భక్తుల రాకతో ఆధ్యాత్మిక వెల్లివిరుస్తున్నది. ఫలితంగా వ్యాపారాల వృద్ధితోపాటు ఎందరికో ఉపాధి లభిస్తున్నది.

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ)

**తెలంగాణ తిరుపతి యాదగిరి గుట్ట..**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం తెలంగాణ తిరుపతిగా పేరొందుతున్నది. స్వయంభూ నారసింహుడి దర్శనం కోసం నిత్యం వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. స్వరాష్ట్రంలో కేసీఆర్ హయాంలో ఆలయాన్ని యావత్ దేశం అబ్బురపడేలా అద్భుతంగా పునర్నిర్మించారు. ఇందుకోసం సుమారు రూ.1200 కోట్లు ఖర్చు చేశారు. ఆలయ పునర్నిర్మాణం కోసం ఏకంగా 9.5 లక్షల ఘనపు మీటర్ల కృష్ణశిలను వినియోగించారు. ఆలయ గోపురాలు మాఢవీధుల, ప్రాకారాలు, గర్భగుడి, ధ్వజస్తంభం, శివాలయం, క్యూలైన్లు, ప్రసాదం వంటశాల, పుష్కరిణి, యాగశాల నిర్మించారు. కొండ కింద దిగువన లక్ష్మీ పుష్కరిణి, స్వామి వారి తెప్పోత్సవం కోసం గండిచెరువు, కల్యాణకట్ట, దీక్షాపరుల మండపం, నిత్యాన్నదాన సత్రం, సత్యనారాయణ స్వామి వ్రత మండపం, ఆర్టీసీ, దేవస్థాన మండపాలు, గుట్ట చుట్టూ ఫ్లై ఓవర్లు నిర్మించారు. ఇప్పుడు దేశంలో ఓ ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా యాదగిరిగుట్ట వెలుగొందుతున్నది. ఆలయ పునర్నిర్మాణం తర్వాత గుట్టకు భక్తుల తాకిడి భారీగా పెరిగింది.



వలిగొండ మండలంలోని మత్స్యగిరి ఆలయం

**మత్స్యగిరి.. రమణేశ్వరం.. ఎల్లమ్మ టెంపుల్.. కొలనుపాక**

ఆలేరు మండలంలోని కొలనుపాక ఎంతో ప్రసిద్ధి. ఇక్కడ స్వయంభూ సోమేశ్వర స్వామి ఆలయం ఉంది. ఇది ప్రాచీన ఆలయం. ఇక్కడ మ్యూజియం కూడా ఉంది. కేసీఆర్ హయాంలో ఆలయానికి మెరుగులు దిద్దారు. దాని పక్కనే జైన్ మందిర్.. జైనుల ఆరాధ్య కేంద్రంగా విరాజిల్లుతున్నది. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో రేణుకా ఎల్లమ్మ ఆలయం భక్తుల కొంగుబంగారంగా నిలుస్తున్నది. వలిగొండ మండలంలోని వేముల కొండలో మత్స్యగిరి లక్ష్మీనరసింహుడి ఆలయం మరో ప్రముఖ పుణ్యక్షేత్రంగా అలరారుతున్నది. ఇక్కడి చేపలకు ఎక్కడా లేని విధంగా బంగారు మీసాలు ఉన్న విషయం అందరికీ తెలిసిందే. ఇక భువనగిరి మండలంలోని నాగిరెడ్డి పల్లి వద్ద రమణేశ్వరం ఆలయం బంగారు లింగానికి ప్రసిద్ధి చెందింది.



భువనగిరిలోని స్వర్ణగిరి ఆలయం

**స్వర్ణగిరిలో కొలువైన వేంకటేశ్వరుడి క్షేత్రం..**

భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వర క్షేత్రం మినీ తిరుపతిగా విరాజిల్లుతున్నది. జిల్లాలో మరో పుణ్యక్షేత్రంగా అలరారుతున్నది. స్వర్ణగిరి ఆలయాన్ని ధర్మకర్తలు మానేపల్లి రామారావు, ఆయన కుమారులు మురళీకృష్ణ, గోపీకృష్ణ నిర్మించారు. 22 ఎకరాల్లో ఉన్న క్షేత్ర నిర్మాణానికి దాదాపు ఏడేండ్ల సమయం పట్టింది. మార్చి 6న స్వామివారు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. క్షేత్రంలో ఉన్న స్తంభాలు వేటికవే ఓ ప్రత్యేకత. గుడిలో సిమెంట్‌ను ఉపయోగించలేదు. రాతి కట్టడాలు, ఇంటర్‌లాకింగ్ పద్ధతుల్లో నిర్మించారు. గర్భగుడి వెలుపలకు రాగానే తిరుపతిలో మాదిరిగా విమాన వేంకటేశ్వర స్వామిని చూడవచ్చు. ప్రపంచంలో ఎక్కడా లేని మదన గోపాలుడి విగ్రహాన్ని చూడవచ్చు. ప్రపంచంలోనే రెండో జలనారాయణుడి విగ్రహం ఇక్కడ ఉంది. నిత్యం స్వామి వారికి అన్ని రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**దేశ, విదేశాల నుంచి భక్తుల తాకిడి..**

ఆధ్యాత్మిక క్షేత్రాలు కొలువై ఉండటంతో యాదాద్రి జిల్లాకు నిత్యం వేలాది మంది భక్తులు పోటెత్తుతున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి పెద్ద ఎత్తున దర్శనాల కోసం తరలివస్తున్నారు. ముఖ్యంగా శని, ఆదివారాలతోపాటు సెలవు రోజుల్లో యాదాద్రి జిల్లా జనంతో కళకళలాడుతున్నది. హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసిపోతున్నది. అనేక సందర్భాల్లో ట్రాఫిక్ జాం అవుతున్నదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. యాదగిరిగుట్టను దర్శించుకున్న భక్తులు.. అటు నుంచి స్వర్ణగిరికి తప్పకుండా వెళ్తున్నారు. స్వర్ణగిరి పక్కనే ఉన్న ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అంతే కాకుండా అటు నుంచి రమణేశ్వరం, మత్స్యగిరి క్షేత్రాన్ని కూడా దర్శించుకుంటున్నారు. ఆర్టీసీ సైతం ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నది.



ఆలేరు మండలం కొలనుపాకలోని సోమేశ్వర ఆలయం



ఆలేరు మండలం కొలనుపాకలోని జైన్ మందిర్

**వ్యాపారాల మెరుగు.. ఎందరికో ఉపాధి..**

జిల్లాకు నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుండటంతో పర్యాటకంగా, వ్యాపారంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నది. ఎంతో మందికి స్వయం ఉపాధి అవకాశాలు పెరిగాయి. ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలు పెద్ద ఎత్తున అందుబాటులోకి వచ్చాయి. రోజంతా చేతి నిండా పని దొరుకుతున్నది. ఇక హోటల్ వ్యాపారాలు కూడా భారీగా వృద్ధి చెందాయి. రోడ్డు పక్కన టిఫిన్ సెంటర్లు మొదలుకొని పెద్ద హోటళ్ల వరకు గిరాకీ పెరిగింది. శని, ఆదివారాలతోపాటు సెలవు దినాలు జనాలు నిలబడే స్థలం లేనంతగా హోటళ్లు మారుతున్నాయి. భక్తికి సంబంధించిన సామగ్రి దుకాణాలు కూడా వెలిశాయి.



కొలనుపాక ఎస్సీ బాలుర హాస్టల్‌లో బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హన్మంతరావు

## విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

- కొలనుపాక ఎస్సీ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ హన్మంతరావు
- విద్యార్థుల గైర్హాజరుపై ఆగ్రహం

ఆలేరు రూరల్, నవంబర్ 32 : మండలంలోని కొలనుపాక ఎస్సీ బాలుర హాస్టల్‌ను శనివారం రాత్రి కలెక్టర్ హన్మంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. 39మంది విద్యార్థులకు గానూ 18మంది విద్యార్థులు ఉండడంతో ఆయన వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాత్రి భోజనాన్ని కలెక్టర్ వడ్డించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్లు తప్పనిసరిగా హాస్టల్‌లో ఉండాలని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తదితరులున్నారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## జిందాషా మదార్ సాహెబ్ ఉర్సులో పల్లా ప్రార్థనలు

ఆలేరు టౌన్, నవంబర్ 30 : ఆలేరు బైపాస్ సమీపంలోని జిందాషా మదార్ సాహెబ్ దర్గా ఉర్సు రెండో రోజుకు చేరింది. జనగామ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శనివారం దర్గాను సందర్శించి ప్రార్థనలు నిర్వహించారు. దర్గా సంరక్షకుడు బీజని మధు బాబా ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా మసీద్ పెద్దలు పల్లా రాజేశ్వర్‌రెడ్డిని శాలువాతో సత్కరించి పూల మాలలు వేశారు.

కార్యక్రమంలో మహమ్మద్ సాబ్ అహ్మద్, హజర్ సాబ్, హుసేని సాబ్, సాహిబ్ సాబ్ , దర్గా కమిటీ సీస శంకర్, మహమ్మద్ జానీ, జలీల్, జబ్బర్, కరుణాకర్, ఆలేటి రవి, పూల అశోక్, బీజని రవి ఉన్నారు.




పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిరసన వ్యక్తం చేస్తున్న భువనగిరి ప్రభుత్వ దవాఖాన కార్మికులు

## పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

**ప్రభుత్వ దవాఖాన ఎదుట పారిశుధ్య కార్మికుల నిరసన**

భువనగిరి అర్బన్, నవంబర్ 30 : పెండింగ్‌లో ఉన్న 3 నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బంది, సెక్యూరు గార్డులు శనివారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్ మాట్లాడుతూ దవాఖానలో పనిచేస్తున్న మెడికల్ కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడంలో సంబంధిత కాంట్రాక్టు యాజమాన్యం విఫలమైందన్నారు. జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వకపోగా, ఇచ్చే తక్కువ వేతనాలు కూడా 3 నెలలు అవుతున్నా ఇవ్వకుంటే కార్మికుల జీవనం సాగేది ఎలా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేశ్, కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, మెడికల్ కాంట్రాక్టు కార్మికులు సుగుణ, సులోచన, లక్ష్మి, వాణి, భారతమ్మ, ఉపేందర్, లలిత, విజయలక్ష్మి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆందోళన బాటలో మోడల్ స్కూల్ టీచర్లు




- సమస్యలు పరిష్కరించకుంటే డిసెంబర్ మొదటి వారం నుంచి నిరసనలు
- ఇప్పటికే విద్యాశాఖ కమిషనర్, మోడల్ స్కూల్ ఉన్నతాధికారులకు ఆందోళన నోటీసులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 32 మోడల్ స్కూళ్లు.. 520 మంది ఉపాధ్యాయులు

రామగిరి, నవంబర్ 30 : తెలంగాణ మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. దీంతో ఇప్పటికే పలు పర్యాయాలు వారు ఆందోళన చేసిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో డిసెంబర్ మొదటి వారం నుంచి దశలవారీగా ఆందోళనకు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా విద్యాశాఖ కమిషనర్‌తోపాటు మోడల్ స్కూల్స్ డిప్యూటీ డైరెక్టర్‌కు ప్రోగ్రెసివ్ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ(పీఎంటీఏ–టీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తరాల జగదీశ్ ఆధ్వర్యంలో వేర్వేరుగా నోటీసులను అందజేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 32 మోడల్ స్కూళ్లలో 520మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. నల్లగొండ జిల్లాలో 17 పాఠశాలలు 270 మంది, సూర్యాపేట జిల్లాలో 9పాఠశాలలు 150 మంది, యాదాద్రిభువనగిరి జిల్లాలో 6 పాఠశాలలు 100మంది పనిచేస్తున్నారు.

**పరిష్కరించాల్సిన సమస్యలు ఇవే..**

- మోడల్ స్కూళ్లను పాఠశాల విద్య డైరెక్టరేట్‌లో విలీనం చేయాలి. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు అందజేయాలి.
- ఒకే నోటిఫికేషన్ కింద ఎంపికై నప్పటికీ రెండో దశ నియామకమైన మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు మెమో 4953/SER III/2021, ప్రకారం వారికి మొదటి దశ వారితో సమానంగా నోషనల్ సర్వీస్ , నోషనల్ ఇంక్రిమెంట్ వర్తింపజేయాలి.
- మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలి. మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్యనియమాకాలు కల్పించాలి. సీపీఎస్ డెత్ గ్రాడ్యూటీ, ఫ్యామిలి పెన్షన్ అందించాలి.
- ప్రమోషన్లు వెంటనే చేపట్టాలి. పెండింగ్ బకాయిలు చెల్లించాలి.



నోటి వ్యాధులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

## నోటి వ్యాధులకు సత్వర చికిత్స అందించాలి

- ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్, నవంబర్ 30 : నోటి వ్యాధులకు సత్వర చికిత్స అందించాలని ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా అన్నారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ పెడోడొంటిక్స్ అండ్ ప్రివెంటివ్ డెంటిస్ట్ పిలుపు మేరకు బీబీనగర్ ఎయిమ్స్ డెంటిస్ట్ విభాగం ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నవంబర్ 14 నుంచి ఇప్పటి వరకు బీబీనగర్ పట్టణ కేంద్రంలోని మాంటిస్సోరి పాఠశాలలో 380 మంది, పోచంపల్లి, చౌటుప్పల్ మండల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, అధ్యాపకులకు నోటి, దంత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి చికిత్సను అందించారు. విద్యార్థులతో మంచి నోటి ఆరోగ్యం కోసం ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మంచి నోటి పరిశుభ్రత పద్ధతులు, అందుబాటులో ఉన్న చికిత్సా విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అభిషేక్ అరోరా, రాహుల్ నరంగ్, అనురాగ్ నేగి, అసోసియేట్ ప్రొఫెసర్ ఆర్ శ్యామల, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## రామానంద తీర్థలో సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తులు

భూదాన్‌పోచంపల్లి, నవంబర్ 30 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామం స్వామి రామనంద తీర్థ గ్రామీణ సంస్థలో మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్‌ఎస్‌ఆర్ లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరునెలల కాల పరిమితితో కూడిన ఎలక్ట్రిషన్ (డొమెస్టిక్), సోలార్ సిస్టం, ఇన్‌స్టాలేషన్, సర్వీస్ (ఐటీఐ/డిప్లొమో పాస్), కంప్యూటర్ హార్డ్వేర్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ , సీసీటీవీ టెక్నీషియన్ (పదో తరగతి) టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోజి, క్విల్ట్ బ్యాగ్స్ మేకింగ్ (ఎనిమిదో తరగతి పాస్) కోర్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత గల ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సెట్, పాస్ ఫొటోలు, ఆధార్ కార్డు, ఆదాయ సర్టిఫికెట్‌లతో డిసెంబర్ 9న ఉదయం 10 గంటలకు రామానంద సంస్థలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, హాస్టల్ భోజన వసతి కల్పిస్తారని తెలిపారు. వివరాలకు 9133908000, 9133908111, 9133908222 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.